క్లుప్తంగా

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

సబ్బవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రమ శిక్షతో విద్యనభ్యసించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఎస్ఐ రాజశేఖర్ అన్నారు.స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.క్రమశిక్షణతో చదువుకొని ఉత్తమ భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మాదక ద్రవ్యాల వల్ల అనర్థాల గురించి అందరికీ వివరించి చైతన్యవంతులు చేయాలన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు విక్రయించినా.. సేవించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శంకర్‌తో పాటు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో చేటు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ

పెందుర్తి: యువత లక్ష్యం నెరవేరాలంటే కచ్చితంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు పాడుచేసుకుని తల్లిదండ్రులకు క్షోభ మిగిల్చినవారవుతారన్నారు. పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వినియోగం-దుష్ఫలితాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అలాగే ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో ఆర్థికంగా చితికి పోయి ప్రాణాలు తీసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. యువత కష్టపడి పైకి రావాలే తప్పా అడ్డదారుల్లో ముందుకు వెళ్లాలనుకోవడం మంచి పరిణామం కాదన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలతో మాట్లాడుతున్న హార్బర్ క్రైం సీఐ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హార్బర్ క్రైం సీఐ జి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అయ్యన్నపాలెం పార్కులో క్రీడాకారులు, వాకర్లతో శనివారం ఆయన మాట్లాడారు. మీ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. ఎండలు ఎక్కువగా ఉంటున్నందున రాత్రి వేళల్లో మేడలపై, ఆరుబయట నిద్రించేవారు ఇళ్లకు తాళాలు వేసి, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎవరైనా ఇళ్లకు తాళం వేసి, ఊళ్లకు వెళ్తే సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే, ఆయా ఇళ్ల వద్ద నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలు ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లేటపుడు తమ ఆభరణాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని, చైన్ స్నాచర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ అప్పలరాజు, హెడ్ కానిస్టేబుల్ రాజేష్ పాల్గొన్నారు.

వరాహ పుష్కరిణి వద్ద పోలీసుల నిఘా



వరాహ పుష్కరిణి వద్ద పరిశీలన చేస్తున్న సీఐ సురేష్ తదితరులు

సింహాచలం: గంజాయి, డ్రగ్స్ సరఫరాతో పాటు వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా శనివారం రాత్రి గోపాలపట్నం పోలీసులు సింహాచలంలోని వరాహ పుష్కరిణి తదితర ఏరియాల్లో తనిఖీలు నిర్వహించారు. గోపాలపట్నం సీఐ సురేష్, ఎస్ఐ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు

పెందుర్తి

9885181097



రాళ్లు తేలిన మెట్టపాలెం రహదారి



ధ్వంసమైన వెంకటాపురం రహదారి

ప్రయాణం.. నరకప్రాయం

- అధ్వానంగా పలు రోడ్లు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పరవాడ: మండలంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. రాళ్లు తేలడంతో ఆయా గ్రామాల ప్రజలు నరకాన్ని చూస్తున్నారు. ధ్వంసమైన రోడ్లపై ప్రయాణించడంతో వాహనాలు దెబ్బతినడంతో పాటు ఒళ్లు గుల్ల అవుతుందని వాహనదారులు వాపోతున్నారు. వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి

వాడచీపురుపల్లి-వెంకటాపురం గ్రామానికి నిర్మించిన రహదారి అడుక్కో గుంత అన్నట్టు ఉంది. రోడ్డు పొడవునా గుంతలు ఏర్పాడ్డాయి. రాళ్లు లేచి పోయి నడవానికి కూడా వీల్లేక ప్రజలు నరకయాతన పడుతున్నారు. కూరగాయల రైతులు, పాఠశాలల విద్యార్థులు, కార్మికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇక చీకటి పడితే రహదారిలో వీధి లైట్ల లేక బితుకు బితుకు మంటూ ప్రయాణం సాగిస్తున్నారు.

- నాయుడుపాలెం శివారు మెట్టపాలెం రోడ్డు శిథిలావస్థకు చేరింది. సుమారు 8 ఏళ్లు కావస్తున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. రహదారిలో గుంతలతో పాటు రాళ్లు పైకి లేచిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయిందని చుక్క నాయుడు వాపోయాడు.
- పరవాడ-బొట్టవానిపాలెం రహదారిలో పరవాడ పైడిమాంబ ఆలయం ఎదురుగా ఉన్న రహదారి గుంతల మయంగా మారింది. ఏ మాత్రం వర్షం కురిసినా రోడ్డు మీదుగా వరద నీరు ప్రవహించడంతో రోడ్డు కొట్టుకుపోయి గుంతలమయంగా తయారైంది. దీంతో వాహనాల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. భారీ వాహనాల రాకపోకల కారణంగా తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఊటగెడ్డ కూడలి వద్ద రోడ్డు మరింత దారుణంగా తయారైంది. నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు ఎన్టీపీసీ, హిందూజా, ఎస్ఈజెడ్ పరిశ్రమలకు రాకపోకలు సాగించడంతో రోడ్డు ధ్వంసమైంది. అధికారులు మరమ్మతులకు చర్యలు చేపట్టని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఇదే రహదారిలో ధర్మారాయుడుపేట జంక్షన్ వద్ద భారీ గుంతలతో నరకం చూస్తున్నామని గ్రామస్తులతో పాటు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



పరవాడ సినిమాహాలు కూడలి సమీపంలో అధ్వానంగా మారిన రహదారి

మా అంగీకారంతోనే భూములిచ్చాం

- కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- ముదపాక ల్యాండ్ పూలింగ్ రైతుల స్పష్టీకరణ



మాట్లాడుతున్న ముదపాక రైతులు

సీతంపేట: మా అంగీకారంతోనే ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చామని పెందుర్తి మండలం ముదపాక రైతులు స్పష్టం చేశారు. అయినా తమ భూములపై ఓ వర్గంతో పాటు ఓ దిన పత్రికలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ముదపాక రైతులు సారిపల్లి గణేష్, ముదపాక శివ, సియ్యాద్రి రమణ, గొర్లె అప్పన్న, గొలగాని దేముడు తదితరులు విలేకరులతో మాట్లాడారు. ల్యాండ్ పూలింగ్ స్కీంలో భాగంగా అసైన్డ్ రైతులు, ఆక్రమణలో ఉన్న రైతులను గుర్తించి తమ వద్ద ప్రభుత్వం భూమి సేకరించిందన్నారు. అసైన్డ్ అయితే ఎకరాకు 900 చదరపు గజాలు, ఆక్రమణ భూమి అయితే ఎకరాకు 450 చదరపు గజాల చొప్పున రిజిస్ట్రేషన్ చేసి సర్వ హక్కులు కల్పిస్తామని చెప్పడంతో తామంతా భూములు ఇచ్చామన్నారు. 2016లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 290 ప్రకారం ముదపాక గ్రామంలో సర్వే నంబర్లు 76, 1, 83, 67, 75లలో సుమారు 350 ఎకరాలు పూలింగ్‌కు ఇచ్చామని తెలిపారు. గ్రామ సభల అనంతరం రెవెన్యూ అధికారుల సమక్షంలో రైతుల భూముల సర్వే జరిగిందని, ఆ సమయంలో అప్పటి వీఆర్వోను మభ్యపెట్టి ఈ సర్వే నంబర్లలో భూమి లేని వారి పేర్లు చేర్చారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి తప్పుడు సమోదులను తొలగించి నిజమైన రైతులను గుర్తించారని చెప్పారు. నిజమైన రైతులకు ప్రభుత్వం ల్యాండ్‌పై హక్కులు కల్పిస్తూ పత్రాలు జారీ చేసిందన్నారు. దీంతో ఎక్కువ భూములు కలిగినట్టు దొడ్డిదారిన నమోదు చేయించుకున్న ఓ వర్గం వ్యక్తులు హైకోర్టులో కేసులు వేశారన్నారు. కొందరు తమ స్వార్థ ప్రయోజనాలతో ఓ దినపత్రికతో పాటు ముదపాక పంచాయతీ పాటు యంత్రాంగంపై రోజూ నిరాధారమైన వార్తలు రాయిస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్ పూలింగ్ స్కీంకు వ్యతిరేకంగా హైకోర్టులో కేసులు వేసిన వ్యక్తుల భూమి మినహాయించి పూలింగ్‌కు సమ్మతించిన రైతులకు మాత్రమే లే అవుట్ వేసి కన్వేయన్స్ డీడ్స్ ద్వారా హక్కులు కల్పించడం జరిగిందన్నారు. ముదపాక భూములపై తప్పుడు వార్తలు ప్రచురించడంతో నిజమైన హక్కులు పొందిన తాము తమ అవసరాలకు భూమి విక్రయించడానికి ఆటంకం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరాధారమైన వార్తలు ప్రచురిస్తున్న పత్రికపై చర్యలు తీసుకోవాలని, న్యాయస్థానాన్ని పక్క దోవ పట్టిస్తున్న ఓ వర్గంపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

కార్మిక హక్కుల రక్షణకు నిరంతర పోరాటం

- సీఐటీయూ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు
- కార్మికులకు శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న జగ్గునాయుడు

ఉక్కునగరం: కార్మిక హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత వేగవంతంగా కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేస్తోందని, అందులో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా ప్రైవేటుపరం చేసేందుకు పూనుకుంటోందన్నారు. ప్లాంట్‌ను ఆర్థికంగా ఆదుకోవాల్సింది పోయి ప్లాంట్ ఆస్తులను అమ్మకానికి పెట్టడం దుర్మార్గమన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావు ప్రిన్సిపాల్‌గా, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. తరగతులకు స్టీల్‌ప్లాంట్, బీహెచ్ఈఎల్, హెచ్ఎస్ఎల్, హెచ్‌పీసీఎల్, పోర్టు ట్రస్ట్, మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



కలశ స్నపనం చేస్తున్న అర్చకులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. వారం రోజుల పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆరాధన, పారాయణం, నిత్య హోమం, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణ, నవకలశ పూజ, చక్రస్నానం జరిపించారు. సాయంత్రం విష్వక్సేన పూజ, పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. ఆలయ ధర్మకర్త ఇ.కె. చారి దంపతులు, కమిటీ ప్రతినిధులు సాయిబు నాయుడు, నరసింగరావు, గురనాథరావు, కృష్ణారావు, సత్యనారాయణ, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సోమశేఖర్, గొల్లవిల్లి వెంకటరావు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామికి విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: పౌర్ణమి సందర్భంగా పెందుర్తి సాధు మఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు.

వ్యాధుల వివరాల నమోదు తప్పనిసరి

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూలకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి జిల్లా మలేరియా అధికారిని సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం అనంతరం జిల్లాలో 'స్టాప్ డయేరియా'ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. ఐఆర్‌ఏడీ యాప్ అప్‌లోడ్ గురించి తెలిపారు. అంతే కాకుండా పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్, ఫారం-ఎఫ్ అప్‌లోడింగ్, రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ తదితర వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని ఆస్పత్రులు రెన్యువల్స్, రిజిస్ట్రేషన్స్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఫారం-ఎఫ్ ఆన్‌లైన్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా సాధారణ కాన్పులు చేయాలని, సాధ్యమైనంత వరకు సి-సెక్షన్ ప్రసవాలు తగ్గించాలని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తులసీరాజ్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వ్యాధులకు సంబంధించిన రిపోర్టులు తెలియజేసేటప్పుడు రోగుల ఆధార్ కార్డు, ఇతర వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. దాని వలన రోగిని సులభంగా గుర్తించి మెరుగైన వైద్య సేవలందించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ జగదీష్ ప్రసాద్, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, ఐఆర్‌ఏడీ మెడికల్ అధికారి డాక్టర్ ఎ.యామినీశాంతి, జిల్లా గణాంక అధికారి మురళీకృష్ణ, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


జల సంరక్షణకు శ్రీకారం



ఇంకుడు గుంత నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వరప్రసాద్

మురళీనగర్: నగరంలో భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్(ఏపీ ఫెర్వాస్) అధ్యక్షుడు ఉదయ్ షిర్‌నామే తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టారు. మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఇంకుడు గుంత నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా షిర్‌నామే మాట్లాడుతూ నగరంలోని అన్ని పార్కుల్లోనూ ఇంకుడు గుంతల నిర్మాణానికి అయ్యే ఖర్చు తమ సంఘం భరిస్తుందని తెలిపారు. కాంక్రీట్ జంగిల్ పెరుగుతున్న నేపథ్యంలో ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా జల సంరక్షణకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని సనపల వరప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్.ఆర్.మూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, జోన్-5 కో ఆర్డినేటర్ కర్రి శేషగిరిరావు, వనితా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి,



తులాభారం సమర్పిస్తున్న భక్తులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన అనంతరం స్వామికి బాలభోగం పెట్టారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద, మజ్జిగ వితరణ చేపట్టారు.

27న దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం

సబ్బవరం: సబ్బవరం ప్రజల ఆరాధ్య దేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీదుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 27న నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. 26, 27 తేదీల్లో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి దంపతులచే గణపతి పూజ,పుణ్యాహవచనం,రక్షా బంధనం, మండపం ఆవాహన,అగ్ని మదనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 27న ఉదయం నుంచి దంపతులచే పూజా కార్యక్రమంలో భాగంగా పంచగవ్య ప్రాసన,నవ కలశ స్థాపన,అమ్మవారికి పంచామృతాభిషేకం,పూర్ణాహుతి, ఆశీర్వచనం జరపనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొవడానికి ఆసక్తి ఉన్న దంపతులు ఆలయ కమిటీవారిని సంప్రదించాలన్నారు. 27న మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైతు బజారులో పార్కింగ్ నిర్వహణకు టెండర్లు

గోపాలపట్నం: గోపాలపట్నం, కంచరపాలెం రైతు బజార్లలో వాహనాల పార్కింగ్ నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఆసక్తిగల వారు రూ10000 ధరావత్తు చెల్లివచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంయుక్త కలెక్టర్ రైతు బజార్లు, విశాఖ పట్నం పేరున తీసిన డీడీ జత చేసి దరఖాస్తును జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్ నంబర్-8-202/2, ఆర్ఆర్‌వీ పురం, గోపాలపట్నంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 28 మధ్యాహ్నం 1గంట లోగా దరఖాస్తులు చేయాలని తెలిపారు. 28న సాయంత్రం 4 గంటలకు టెండర్ తెరచి కలెక్టర్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కంచరపాలెం రైతు బజారులో పార్కింగ్ ధర రూ.47,250, గోపాలపట్నం రైతుబజారులో రూ. 77,164 ప్రభుత్వ ధర ఉంటుందని తెలిపారు. సైకిల్‌కి రూ.2, ద్విచక్రవాహనానికి రూ.5, ఆటోకు. 10, కారుకు రూ.20 వసూలు చేయాలి. గుర్తింపు పొందిన రైతుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేయరాదని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 9030819082 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

బడి ఈడు పిల్లలను గుర్తిద్దాం

- సమన్వయంతో శతశాతం అక్షరాస్యత సాధిద్దాం
- పెదగంట్యాడ ఎంఈవో శ్రీనివాసరావు



బడికి పోదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

గాజువాక : బడిఈడు పిల్లలను గుర్తించే బాధ్యతను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు తీసుకోవాలని విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారి ఇ.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం లక్షల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. బడిఈడు పిల్లల్ని అన్ని శాఖల అధికారులు గుర్తించాలని, శత శాతం అక్షరాస్యతను సాధించడానికి కృషి చేయాలని కోరారు. ఈ నెల 13న ప్రారంభమైన ఈ కార్యక్రమం వచ్చేనెల 13 వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో లేబర్ ఐసీడీఎస్, లేబర్ డిపార్టుమెంట్ ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. చిన్నారులను గుర్తించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. బడి మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ బడిలో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లకు పైబడ్డ చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం స్టూడెంట్ కిట్లు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో గాజువాక, పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు విశ్వనాథం, సునీత, కె.రమణాజీ, ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్టు అధికారి నీలిమ, లేబర్ డిపార్టమెంట్ అధికారి నరేష్, జీవీఎంసీ సూపరింటెండెంట్ ఈశ్వరి పాల్గొన్నారు.

కేకే లైన్‌లో జీఎం తనిఖీలు



కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ కేకే(కొత్తవలస-కోరాపుట్) లైన్‌లో శనివారం ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్ తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణా సామర్థ్యం, ప్రయాణికుల సదుపాయాలతోపాటు రెండో లైన్ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా రైల్ వినియోగదారులు, భాగస్వాములైన ఎన్ఎండీసీ వంటి కంపెనీల ప్రతినిధులతో సమావేశమై రైల్వే అభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకోవాలని, దీని ద్వారా ఇరువర్గాలు లబ్ధి పొందుతాయని జీఎం సూచించారు. ఈ మార్గంలో గల కోరాపుట్, అరకు, శివలింగపురం స్టేషన్లలో పర్యటించి, అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విండో ట్రయలింగ్ ద్వారా నిర్మాణంలో ఉన్న డబ్లింగ్ లైన్, గుహలు, మలుపులు, క్రాసింగ్స్, పాయింట్స్, వంతెనలను కూడా తనిఖీ చేశారు. పర్యటనలో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, చీఫ్ ఫ్రైట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ దిబ్బంజన్ రాయ్, ఇతర ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్త శక్తుల సమాహారం మహాకాళి



ప్రవచిస్తున్న రమ్యానందభారతీ

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురుదేవుల ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం త్రిశక్తి వైభవంపై శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని ప్రవచనం చేశారు. దేవీ భాగవతం, కాళీ పురాణంలో అమ్మవారి వైభవ విశేషాలు ఉన్నాయని తెలిపారు. కాళీ రూపంలో అమ్మవారు పరమేశ్వరుడికి ప్రియమైన స్వరూపమని, శివశక్తి అభేద్యమని, కాళీమాత వాక్శక్తినిచ్చే దేవతని, సమస్త శక్తుల సమాహారమైన మహాకాళి అని కాళీతత్వాన్ని వివరించారు. మాత అలంకారాలను, ఆయుధాలను, శక్తులను, విశిష్టతను వివరించారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ఈ ప్రవచన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెందుర్తి

9912222753

Office mail : sakshiadvtvsp@gmail.com